నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 23 సెప్టెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

'అడ్డగోలుగా ఉద్యోగాల భర్తీ'పై..
విచారణకు ఆదేశం
'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 22: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీల భర్తీకి నిర్వహిస్తున్న ప్రక్రియలో చోటుచేసుకున్న తప్పిదాలపై డీఈవో సోమశేఖరశర్మ విచారణకు ఆదేశించారు. సర్టిఫికెట్ల పరిశీలనలో నిబంధనలు పాటించకపడం లేదని, అర్హతలేని వ్యక్తితో ధ్రువపత్రాలు వెరిఫికేషన్ జరుగుతోందనే అంశాలను ప్రస్తావిస్తూ 'అడ్డగోలుగా ఉద్యోగాల భర్తీ' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి డీఈవో స్పందించారు. వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థుల వివరాలు మరోసారి పరిశీలిస్తామని, సర్టిఫికెట్ల పరిశీలనకు అర్హతలేని వ్యక్తిని పేర్కొంటూ ఫైల్ పెట్టిన వారి వివరాలు సేకరించి షోకాజ్ నోటీసులు ఇస్తామని 'నమస్తే'కు తెలిపారు.

కొత్తగూడెంలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్
ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
సందడి చేసిన సినీ తారలు పాయల్ రాజ్‌పుత్, నేహాశెట్టి

షాపింగ్‌మాల్‌లో విస్తృత శ్రేణి వస్త్రాలను చూపిస్తున్న హీరోయిన్‌లు

చుంచుపల్లి, సెప్టెంబర్ 22: భద్రాద్రి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న చుంచుపల్లి మండలం విద్యానగర్‌కాలనీ ప్రధాన రహదారి పక్కన నూతనంగా ఏర్పాటుచేసిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 36వ షోరూం ఆదివారం అట్టహాసంగా శుభారంభమైంది. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సినీ తారలు నేహాశెట్టి, పాయల్ రాజ్‌పుత్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. కస్టమర్ల ఆరంభ ఆఫర్‌గా అన్ని వెరైటీలపై కాస్ట్ టూ కాస్ట్ సేల్‌ను ఆవిష్కరించారు. అనంతరం షోరూమ్‌లోని అన్ని వయసులు, తరాల అభిరుచులకు సరితూగే విస్తృత శ్రేణికి చెందిన కలెక్షన్స్ గురించి నేహాశెట్టి మాట్లాడారు. కొత్తగూడెంలోని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ఆవిష్కరణలో భాగం కావడం పట్ల గొప్ప అనుభూతి కలుగోందని పాయల్ రాజ్‌పుత్ పేర్కొన్నారు. వస్త్రాలంకరణకు సంబంధించి మంచి అభిరుచులు కలిగిన కొత్తగూడెం వాసులు ఈ సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌లోని విస్తృత శ్రేణి వస్త్రాలతో రాబోయే పండుగలు, వివాహ వేడుకలను సంతోషంగా జరుపుకుంటారని ఆకాంక్షించారు. ఆవిష్కరణ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, విద్యానగర్ కాలనీ మాజీ సర్పంచ్ గోవింద్, చుంచుపల్లి మాజీ ఎంపీపీ బదావత్ శాంతి, ఎన్‌కేన గర్ మాజీ సర్పంచ్ బదావత్ సుగుణ తదితరులు హాజరయ్యారు. షాపింగ్‌మాల్ డైరెక్టర్లు సురేశ్ శీర్ణ, అభినవ్, రాకేశ్, కేశవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇటీవల మున్నేరు పొంగిన కారణంగా ఖమ్మంలో వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. కేవలం కట్టుబట్టలతో బయటికెళ్లి ప్రాణాలు కాపాడుకున్నారు. ఆ వరద బాధితులంతా నేటికీ కోలుకోలేని పరిస్థితిలో ఉన్నారు. అలాంటి వారిని ఆదుకునే అంశంలో 'ఆరాటం ఆరుబాళ్లు – పని మూడుబాళ్లు' అనే సామెతలా ప్రభుత్వ పనితీరు ఉంది. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డే వరద ప్రాంతాల్లో పర్యటించినప్పటికీ బాధితులకు ఆశించిన మేర ప్రయోజనం కలగలేదు. పరిహారం అందలేదు.

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు అందించేందుకు వచ్చిన వరద బాధితులు (ఫైల్)

సర్వేతోనే సరా?
రోజులు గడుస్తున్నా సగం మందికి అందని సాయం

- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వరద బాధితులు
- జాబితాలో పేరున్నా జమకాని 'మున్నేరు' పరిహారం
- నిండా మునిగినా.. తేలని వరద బాధితుల లెక్కలు

ఖమ్మం, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మున్నేరు వరదల కారణంగా ఖమ్మంలోని వెంకటేశ్వరనగర్, బొక్కలగడ్డ, సారథినగర్, మంచికంటినగర్, మోతీనగర్, పంపింగ్‌వెల్ రోడ్, ధంసలాపురం వంటి కాలనీల్లో తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. రాత్రికి రాత్రే వరదనీరు ఇళ్లలోకి చేరడంతో ఇంట్లో ఏ వస్తువునూ బయటకు తీసుకుపోలేని పరిస్థితి. అయితే వరద బాధిత కుటుంబాలను గుర్తించేందుకు ప్రభుత్వం కంటితుడుపు చర్యలు తీసుకున్నప్పటికీ ఏమాత్రమూ ప్రయోజనం కలగలేదు. ఇతర మండలాల నుంచి ప్రత్యేకంగా సిబ్బందిని రప్పించి వారం పది రోజులపాటు సర్వే చేసినప్పటికీ అసలైన వరద బాధితుల వివరాలను సర్వేలో పొందుపరచలేదనే విమర్శలు బలంగా విన్పిస్తున్నాయి. క్షేత్రస్థాయి పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయి. దాదాపు వారం రోజుల పాటు సర్వే చేసిన యంత్రాంగం.. చివరికి బాధితుల జాబితాను ప్రభుత్వానికి అందజేసింది. అయితే, ఈ సర్వేలో అనేక కొర్రీలు, పొరపచ్చాలు ఏర్పడడంతో బాధిత కుటుంబాలు సర్కారు సాయానికి దూరమయ్యాయి. ఇప్పటికే కొందరి అకౌంట్లలో ఒక్కో కుటుంబానికి రూ.16,500 చొప్పున జమ అయినప్పటికీ అసలైన బాధితుల్లో సగానికి సగం మందికి పరిహారం అందలేదు. దీంతో ఇళ్లు పూర్తిగా నిండి తీవ్రంగా నష్టపోయిన వారిలో చాలామందికి పరిహారం అందలేదు.

జాబితాలో పేరున్నా జమకాలేదు..

జాబితాలో పేరున్న వరద బాధితుల్లో చాలామందికి పరిహారం అందలేదు. తమకు అర్హత ఉన్నప్పటికీ పరిహారం ఎందుకు జమకాలేదంటూ పలువురు బాధితులు అధికారుల వద్ద మొరపెట్టుకుంటే.. 'తక్కువ ప్రభావం ఉన్నందున పరిహారం రాదు' అంటూ సమాధానమిస్తున్నారు. అయితే, వరదలు తగ్గిన తరువాత క్షేత్రస్థాయి సర్వే కోసం వచ్చిన సిబ్బంది ఆదరాబాదరాగా ఇంటింటి పరిశీలన చేశారని బాధితులు చెబుతున్నారు. సర్వేకు వచ్చిన అధికారులు కనీసం తమ ఇంట్లోకి రాలేదని, లోపలికి వచ్చి ఎంత నష్టం జరిగిందో చూడలేదని, ఏయే వస్తువులు తడిచాయో అడగలేదని, ఏయే సామగ్రి వరదలో కొట్టుకెళ్లిందరో నమోదు చేసుకోలేదని వాపోతున్నారు. కేవలం ఇంటిని ఫొటో తీసుకొని తమ పని ముగించుకొని వెళ్లారని ఆరోపిస్తున్నారు. అసలైన బాధితుల్లో చాలామందిని కేటగిరీ–1, 2లలో చేర్చరాని, కేవలం కేటగిరీ–3లో పేరున్న బాధితులనే పరిహారానికి అర్హులుగా గుర్తించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో జాబితాలో తమ పేర్లు ఉన్నప్పటికీ కేటరిగీ–3లో తమ పేర్లన పొందుపర్చని కారణంగా తాము ప్రభుత్వ సాయానికి దూరమయ్యామని దుయ్యబడుతున్నారు. అయితే బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అధికారులు మరోసారి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అయితే రెండో విడతలో దరఖాస్తులు అందజేసే బాధితులకు సర్కారు సాయం అందుతుందా? లేదా? అనేది వేచి చూడాలి.

నాకు పరిహారం రాలేదు

మేన్నేరుకు భారీగా వరద రావడంతో మా ఇల్లు పూర్తిగా మునిగిపోయింది. వాగు పక్కనే మా ఇల్లు ఉంది. రాత్రివేళ మొట్టమొదట మా ఇంట్లోకి వరదనీరు ప్రవేశించింది. దాదాపు ఐదు రోజుల పాటు ప్రభుత్వ పునరావాస కేంద్రంలోనే ఉన్నాం. మేం అక్కడ ఉన్న సమయంలోనే సర్వే సిబ్బందికి మా ఇంటికి వచ్చారట. అప్పుడు మేం లేకపోవడంతో ఆ తరువాత మేమే స్వయంగా మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లి మరోసారి దరఖాస్తు చేశాం. ఆ తరువాత అధికారులు మరోసారి వచ్చి సర్వే చేశారు. కానీ ఇంతవరకు నా ఖాతాలో పరిహారం జమకాలేదు.

–ఉమ్మనేని వెంకటేశ్వర్లు, వరద బాధితుడు, బొక్కలగడ్డ

జాబితాలో పేరున్నా పరిహారం ఎందుకు రావట్లేదు?

సర్వే జాబితాలో మా పేరు ఉంది. కానీ ఇప్పటి వరకు సర్కారు పరిహారం మాకు అందలేదు. ప్రతిరోజూ నయాబజార్, మున్సిపాలిటీల్లోని వరద బాధితుల సర్వే కౌంటర్ల వద్దకు వెళ్తున్నాను. ఎవరిని అడిగినా ఓపిక పట్టాలని అంటున్నారు. కానీ ఇన్ని రోజులైనా పరిహారం జమ కావడం లేదు. చాలామంది తెలివిగా వారి బంధువుల పేర్లు, తెలిసిన వారి పేర్లు రాయించుకున్నారు. వారికి మాత్రం ముందుగానే సాయం అందింది. నిండా మునిగిన మాకు మాత్రం ప్రభుత్వం నుంచి రూపాయి కూడా రాలేదు. మా ఇల్లు మునిగి రూ.3 లక్షల వరకూ నష్టం జరిగింది. కానీ ఆదుకునే దిక్కులేదు.

–చలమల ఉమా, వరద బాధితురాలు, బొక్కలగడ్డ

ఇంత వరకూ జమ కాలేదు..

మున్నేరు వరదలు భారీగా రావడంతో మా ఇంటిలోపల ఉన్న అన్ని వస్తువులూ బురదమయమయ్యాయి. ఏ ఒక్క వస్తువూ పనికొచ్చేలా లేదు. ఇల్లు మునిగిపోయిందని చెప్పి రెండుసార్లు మున్సిపాలిటీకి వెళ్లి మొరపెట్టుకున్నాను. అధికారులు సర్వే కోసం వచ్చారు. కొద్దిరోజుల తరువాత అధికారులు పిలిచారు. ఖాతా నంబరు పొరపాటుగా ఉందని, మరోచెప్పాలని అడిగారు. ఇంకోసారి చెబితే రాసుకున్నారు. కానీ ఇంతవరకు పరిహారం జమ కాలేదు. మాతోపాటు ఇళ్లు మునిగిన వారికి జమ అయ్యాయి. మాకు మాత్రం రాలేదు.

–మోటె మంజుల, వరద బాధితురాలు, వెంకటేశ్వరనగర్

సాగునీరు ఇవ్వడంలో సర్కారు విఫలం
- ముగ్గురు మంత్రులున్నా అన్నదాతలను ఆదుకోలేకపోయారు: సండ్ర

సత్తుపల్లి టౌన్, సెప్టెంబర్ 22: పొట్టదశలో ఉన్న పంటలకు సాగునీరు ఇవ్వడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా అన్నదాతలను ఆదుకోలేకపోయారని ఆరోపించారు. సకాలంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువకు పడిన గండ్లను సకాలంలో పూడ్చడంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించలేదని ఆరోపించారు. దీంతో సాగర్ ఆయకట్టులోని ఖమ్మం జిల్లా రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ కాలువను సాగర్ కాలువకు అనుసంధానం చేసినట్లు ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం.. చివరికి ఆ నీటికి కూడా అందించలేకపోయిందని దుయ్యబట్టారు. వరదల్లో నష్టపోయిన రైతులు.. ఇప్పుడు సాగర్‌లో నీళ్లున్నా సకాలంలో పంటలకు అందక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో క్రమశిక్షణ
- ప్రతి ఒక్కరి దినచర్యలో క్రీడలు భాగం కావాలి
- టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్

టోర్నమెంట్‌లో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పాల్వంచ/పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 22: క్రీడల వల్ల క్రమశిక్షణ అలవడుతుందని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. ఎటువంటి ఒత్తిడులనైనా ఎదుర్కొనే సామర్థ్యం కలుగుతుందని అన్నారు. పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస కాలనీ క్రీడా మైదానంలో జరిగిన టెన్నిస్ టోర్నమెంటును ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఏదైనా ఒక క్రీడపై పట్టు సాధించాలని, ఆసక్తి ఉన్న క్రీడల్లో మెళకువలు నేర్చుకుని తరచూ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. పోటీల్లో పాల్గొంటేనే విజయసూత్రాలు తెలుస్తాయని, ప్రతి రోజూ క్రీడలను దినచర్యలో భాగంగా చేసుకుంటే క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలవైపు ప్రోత్సహించాలని సూచించారు. ప్రకృతి వాతావరణంలో ఆడడం వల్ల ఉత్సాహం పెరుగుతుందని, ఉల్లాసం కలుగుతుందని అన్నారు. శ్రీనివాసకాలనీ గుట్టలు, చండ్రుగొండ మండలంలోని ట్రెక్కింగ్ స్పాట్లను సందర్శించాలని సూచించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ప్రకృతి అందాలు ఉన్నాయని అన్నారు. అనంతరం ఆర్చరీ విభాగాన్ని సందర్శించి క్రీడాకారుల నైపుణ్యాన్ని ప్రశంసించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుకృత, కోచ్‌లు అన్నం వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, భద్రాచలం, కొత్తగూడెం, నవభారత్, కేటీపీఎస్, ఇల్లెందు టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైతిక విలువలు నేర్పాలి
- టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు కృషిచేయాలి
- ఏన్కూరు కేజీబీవీ తనిఖీలో ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న అదనపు కలెక్టర్

వైరా టౌన్, సెప్టెంబర్ 22: కస్తూర్బా విద్యాలయాల్లో చదువుకుంటున్న పిల్లలకు చిన్నతనం నుంచే విద్యతోపాటు మంచి విలువలు, క్రమశిక్షణ వంటివి నేర్పించాలని అదనపు కలెక్టర్ డీ.మధుసూదన్‌నాయక్ సూచించారు. ఏన్కూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలోని కిచెన్, డార్మెటరీ తదితర ప్రదేశాలను పరిశీలించారు. కిచెన్‌లో గరిటె తిప్పుతూ వంటల నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులకు పాఠం బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులకు చిన్నతనం నుంచే నైతిక విలువలతో కూడిన కథలు కూడా నేర్పించాలని సూచించారు. అలాగే, టెన్త్‌లో మెరుగైన ఫలితాల సాధనకు కృషిచేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మండలంలో పర్యటించిన ఆయన.. ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల దరఖాస్తుల పరిశీలనను పరిశీలించారు. ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు. ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూలో అంబర్ పొడి ప్యాకెట్ కలకలం

లడ్డూ మిశ్రమంలో ఉన్న అంబర్ పొడి ప్యాకెట్

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 22: తిరుమల తిరుపతి లడ్డూలో అంబర్ పొడి కలిగిన ఓ తెల్ల ప్యాకెట్ వెలుగుచూసిన ఖమ్మం జిల్లా ఖమం రూరల్ మండలంలో ఆదివారం కలకలం సృష్టించింది. కల్తీ నెయ్యితో తిరుపతి లడ్డూ తయారవుతోందంటూ మూడు నాలుగు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో వివాదం కొనసాగుతున్న వేళ.. అదే తిరుపతి లడ్డూలో అంబర్ పొడి ప్యాకెట్ ఉందంటూ మొదలైన ఈ ఘటనపై జోరుగా చర్చ జరుగుతోంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం పంచాయతీ కార్తికేయ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న దొంతు పద్మావతి ఈ నెల 19న రాత్రి తిరుపతికి వెళ్లారు. 20న రాత్రి తిరుమలలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కౌంటర్‌లో లడ్డూలను కొనుగోలు చేశారు. వాటిని తీసుకొని ఆదివారం తెల్లవారుజామున ఖమ్మం రూరల్లోని తమ ఇంటికి చేరుకున్నారు. ఆ లడ్డూ ప్రసాదాన్ని తోటి బంధువులకు పంచేందుకోసం ఆ లడ్డూలను పొడి చేస్తుండగా.. ఓ లడ్డూలో అంబర్ పొడి కలిగిన తెల్ల ప్యాకెట్ ఉంది. దీంతో పద్మావతి, ఆమె కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. దీంతో ఆ లడ్డూను అలాగే ఉంచామని పద్మావతి కుటుంబ సభ్యులు తెలిపారు.

'రవాణా' సంక్షేమ బోర్డుకు పోరాడాలి
ఆటో, క్యాబ్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలో కూనంనేని

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 22: ఆటో, క్యాబ్ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, పన్నులు–జరిమానాల రూపంలో దోచుకుంటున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఏఐటీయూసీ అనుబంధ ఆటో, క్యాబ్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర తృతీయ మహాసభలు కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. ముందుగా, లక్ష్మీదేవిపల్లి మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి కొత్తగూడెం క్లబ్ వరకు కార్మికులు తమ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. క్లబ్ ఆవరణలో ఏఐటీయూసీ పతాకాన్ని జాతీయ నాయకుడు వీఎస్ బోస్ ఆవిష్కరించి, మహాసభలను లాంఛనంగా ప్రారంభించారు. కూనంనేని మాట్లాడుతూ.. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు తరహాలోనే రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీని కోసం రవాణా రంగ కార్మికులంతా పోరాడాలని పిలుపునిచ్చారు. నాయకులు సాబీర్ పాషా, కంచర్ల జమలయ్య, బాలరాజు, వెంకటేష్, నరాటి ప్రసాద్, ముత్యాల విశ్వనాథం పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

యథేచ్ఛగా ఇసుక దందా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక క్వారీలు మూతపడి ఆరు నెలలు గడుస్తున్నా రవాణా మాత్రం జోరుగా నడుస్తున్నది. స్టాక్ యార్డుల పేరుతో యథేచ్ఛగా అక్రమ తోలకాలు కొనసాగుతున్నాయి. జిల్లా నుంచి అనేక ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగరం వరకు నిరంతరం ఇసుక రవాణా కొనసాగుతున్నది. ఇంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు దారితీస్తున్నది. అప్పడప్పుడూ ఇసుక లారీలను పట్టుకుంటున్నప్పటికీ ఆ వివరాలు బయటికి తెలియనీయడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఇసుక క్వారీలకు అనుమతులు ఇవ్వలేదు. దీంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. ఫలితంగా ఇసుక ధరలు పెరిగి జనం ఇబ్బందులు పడుతున్నారు.

-భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ)

ఇసుక స్టాక్ యార్డు వద్ద లోడ్ అవుతున్న లారీలు (ఫైల్)

- స్టాక్ యార్డు పేరుతో అక్రమ తోలకాలు
- క్వారీలు మూతపడి ఆరు నెలలు
- అయినా నేటికీ జోరుగా రవాణా
- భద్రాద్రి జిల్లాలో మూడు చోట్లనే స్టాక్ యార్డులు
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు
- క్వారీలకు అనుమతులివ్వకుండా తాత్సారం

అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా ఇటీవల అధికారులు సీజ్ చేసిన లారీలు (ఫైల్)

భద్రాద్రి జిల్లావ్యాప్తంగా మణుగూరు, బూర్గంపహాడ్, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఇసుక క్వారీలు ఉన్నాయి. మణుగూరులో రెండు, దుమ్ముగూడెంలో రెండు, భద్రాచలంలో ఒకటి, బూర్గంపహాడ్‌లో రెండు సొసైటీలు నడుస్తుండేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవన్నీ మూతపడ్డాయి. ఇప్పటివరకు ఆయా క్వారీలను సొసైటీలకు అప్పగించకపోవడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. క్వారీలకే కాకుండా 'మన ఇసుక వాహనాల'కు కూడా అనుమతులు ఇవ్వకపోవడం సర్వత్రా అనుమానాలకు తావిస్తున్నది. ఇసుక కొరత సృష్టిస్తే డిమాండ్ పెరిగి అక్రమార్కులకు మేలు చేకూరుతుందన్న ఉద్దేశంతో అధికారులు కాకి కబుర్లు చెబుతూ ఇసుక సొసైటీలను తెరవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి బాహాటంగా వినిపిస్తున్నాయి. 'అసలు స్టాక్ యార్డుల్లో ఎంత ఇసుక ఉంది? వాటికి పర్మిషన్ ఉందా?' అనేది కూడా అధికారులకు తెలియకపోవడం విశేషం. చర్ల ప్రాంతంలో స్టాక్ యార్డు లేకుండానే అక్కడి నుంచి ఇసుక తరలిపోతుండడం గమనార్హం. బూర్గంపహాడ్‌లో కూడా స్టాక్ యార్డు లేకుండానే లారీల ద్వారా ఇసుక అక్రమంగా తరలిపోతున్నది.

దొరికితేనే దొంగ..

కొందరు వ్యక్తులు మధ్యవర్తులుగా ఉండి అధికార పార్టీ నేతల అండతో విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారు. 'దొరికితే దొంగ.. లేదంటే దొర' అన్నట్లు అన్ని చెక్‌పోస్టులకు మామూళ్లు ఇచ్చి యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. ఆకస్మిక తనిఖీల్లో దొరికితే జరిమానా కట్టడం.. లేకుంటే రూ.లక్షలు సంపాదించడం అక్రమార్కులకు నిత్యకృత్యమైంది. ఆర్‌టీఏ అధికారులు కూడా చూసీచూడనట్లుగా ఉండడంతో చెక్‌పోస్టులు దాటి లారీలు వెళ్తున్నాయి. ఇటీవల ఆంధ్రా నుంచి ఇసుక హైదరాబాద్ తరలిస్తుండగా మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. కానీ ఆ లారీలపై సీఎం ఫొటో ఉండడంతో విషయం గోప్యంగా ఉంచారు. ఇదే తరహాలో తాజాగా మరో ఆరు లారీలను ఓవర్‌లోడ్ పేరుతో మైనింగ్ అధికారులు పట్టుకుని జరిమానా విధించారు. కానీ 'ఆ లారీలు ఎవరివి? ఎక్కడకు ఇసుక తరలిస్తున్నారు?' అనే గుట్టువిప్పలేదు. కేవలం జరిమానా విధించడం తప్ప దాని వెనుక ఎవరిహస్తం ఉందో చెప్పకపోవడం గమనార్హం.

జిల్లాలో మూడే స్టాక్ యార్డులు

జిల్లాలో మణుగూరు, భద్రాచలంలో మాత్రమే మొత్తం మూడు ఇసుక స్టాక్ యార్డులు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాను అనేకసార్లు అడ్డుకొని కేసులు నమోదు చేశాం. చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపహాడ్ మండలాల్లో ఇసుక క్వారీలు ఇంకా తెరవలేదు. సొసైటీలకు అనుమతి వస్తే నడుస్తాయి. భద్రాచలం వద్ద పట్టుకున్న లారీలకు జరిమానా విధించాం. గతంలో సారపాకలో కూడా ఆరు లారీలను పట్టుకున్నాం. **– దినేశ్, మైనింగ్ ఏడీ**